క్లుప్తంగా

పీజీఆర్‌ఎస్‌లో 14 అర్జీలు

నందిగామ రూరల్‌: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 అర్జీలు అందినట్లు ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి ఐదు, సర్వే ఆరు, విద్యాశాఖ ఒకటి, పంచాయతీ రాజ్‌ శాఖకు సంబంధించి రెండు అర్జీలు అందాయని తెలిపారు. అర్జీలను ఆయా శాఖాధికారులకు పంపడం జరిగిందని వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస ఉత్సవాలు



నందిగామ రూరల్‌: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం శ్రావణ మాస ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పల్లగిరి గట్టుపైనున్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలోని వాసవీ మాతకు ఆలయ అర్చకుడు మణికంఠ పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శంభులింగేశ్వరునికి ఏకవారాభిషేకం

నందిగామ రూరల్‌: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వరస్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం దశమి సందర్భంగా స్వామివారికి పంచామృతాలు, పలు రకాల పండ్లతో ఏకవారాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం రుద్రాభిషేకం, అర్చనలు, విశేష పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బ్యాటరీ సైకిళ్ల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్‌: పట్టణంలో సోమవారం దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే సైకిళ్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌(తాతయ్య) చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌ యార్డులో నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన మచిలీపట్నంలోని బీహెచ్‌ఈఎల్‌ కంపెనీ వారి సీఎస్‌ఆర్‌ నిధులతో స్వయంశక్తి విభిన్న ప్రతిభావంతుల నిర్వహణలో 25 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్‌ బ్యాటరీ సైకిళ్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బ్యాటరీ సైకిళ్లు ఇచ్చి సాయం చేసినందుకు భారత్‌ హెవీ ఎలక్ట్రానిక్స్‌ కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, నకిరిగంటి వెంకట్‌, సామినేని మనోహర్‌, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా కార్యక్రమాలు ఎనలేనివి

నందిగామ టౌన్‌: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యూట్‌ బ్యాగ్‌ తయారీ, ప్రింటింగ్‌ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ హితం కోరుతూ నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాలు యువతకు ఆత్మనిర్భరత సాధించేందుకు దోహదపడతాయన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపడుతున్న జ్యూట్‌ బ్యాగుల తయారీతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మండవ కృష్ణకుమారి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పెనుగంచిప్రోలు: స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్‌ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, బదిలీపై ఈ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు సోమవారం సత్కరించారు. బదిలీ అయిన ఉపాధ్యాయినులు లీల, నాగజ్యోతి, కుసుమలత, స్వాతి, అలాగే బదిలీపై వచ్చిన వేగినేటి రమణ, ముక్కా సత్యనారాయణ, స్వాతి శిల్పలకు పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం నక్కా బాబూరావు ఆధ్వర్యాన సత్కరించారు.

కూటమి మోసాలను నిలదీద్దాం

వైఎస్సార్‌ సీపీ జగ్గయ్యపేట ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు



కొళ్లికూళ్ల గ్రామంలో క్యూఆర్‌ కోడ్‌ ఆవిష్కరిస్తున్న తన్నీరు, పక్కన ఎంపీపీ గాంధీ తదితరులు

కొళ్లికూళ్ల, సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టి 14 నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయని కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయాలని వైఎస్సార్‌ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని సుబ్బాయిగూడెం, కొళ్లికూళ్ల గ్రామాల్లో సోమవారం పార్టీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ హామీలను చూస్తే భయమేస్తోందని అసెంబ్లీలోనే చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌ సీపీ నేతలను రెడ్‌బుక్‌ పేరుతో వేధిస్తున్నారని విమర్శించారు. పథకాలు అమలు చేయకుండానే ఇప్పటికే ఏకంగా రూ.1.81 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. ఇదే సమయంలో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు ఎంత మేర లబ్ధి పొందారు.. కూటమి ప్రభుత్వంలో ఎంత మేర లబ్ధి నష్టపోయారో గుర్తించాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి క్యూఆర్‌ కోడ్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, బీసీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్‌, కొళ్లికూళ్ల, సుబ్బాయిగూడెం గ్రామ సర్పంచ్‌లు జొన్నలగడ్డ కిషోర్‌, పాపినేని వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు పెరుగు నరసింహారావు, మోరంపుల పూర్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, బీసీ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షులు చేని రాంబాబు, కోనంగి ముక్కంటి, గ్రామ అధ్యక్షుడు అన్నెం బ్రహ్మేశ్వరరావు, నియోజకవర్గ ఎస్సీసెల్‌, ఐటీ వింగ్‌, ట్రేడ్‌ యూనియన్‌ అధ్యక్షులు కీసర లోకేశ్వరరావు, రంజిత్‌, మెండెం రామారావు, పట్టణ యూత్‌ అధ్యక్షుడు కిషోర్‌, మండల ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు బొడ్డు రవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ఇంటింటి ప్రచారం

జగ్గయ్యపేట: కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటి ప్రచారం చేయాలని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ బూడిద నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పాలకుల మోసాలను ప్రజలకు తెలపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం క్యూఆర్‌ కోడ్‌ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కన్వీనర్‌ కాకనబోయిన నాగరాజు, ఎస్సీ సెల్‌ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దర్శినాల వెంకటరమణ, జిల్లా రైతు విభాగం కార్యదర్శి దుర్గాప్రసాద్‌, నాయకులు గద్దా రామకృష్ణ, షేక్‌ షరీఫ్‌, వలీ, గుర్రం నరసింహారావు, దాదాసాహెబ్‌, నరసింహారావు, భాషా, నాగుల్‌మీరా, చల్లా సుశీల, నాయకులు పాల్గొన్నారు.



బత్తినపాడులో క్యూఆర్‌ కోడ్‌ చూపుతున్న మండలాధ్యక్షుడు మల్లికార్జునరావు, నాయకులు



నరసింహారావుపాలెంలో క్యూఆర్‌ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హామీల అమలు ఊసే లేదు

కంచికచర్ల: హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు విమర్శించారు. స్థానిక అరుంధతీ నగర్‌లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీని నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజాసమస్యలు పట్టించుకోకుండా వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజా పాలనను గాలికొదిలేసిందని విమర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్‌ నాయకుడు అమర్లపూడి యోహాన్‌, నాయకులు మాడుగుల శంకర్‌, వేమా శివకోటి, మోగులూరు జగన్‌మోహనరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, గుగులోతు శివనాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో...

మండలంలోని పరిటాల, బత్తినపాడు, కొత్తపేట, గనిఆత్కూరు తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర ప్రకటించకపోవడంతో దుర్మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్‌ మలక్‌బషీర్‌, జిల్లా బీసీ సెల్‌ అధ్యక్షుడు మార్త శ్రీనివాసారావు, చింతా రవీంద్రనాథ్‌, రాయల నరసింహారావు, వేల్పుల రమేష్‌, సర్పంచి జంగా సంతోషరావు, ఎస్సీ సెల్‌ నియోజకవర్గ అధ్యక్షుడు మంగలపూడి కోటిబాబు, వేమవరపు పురుషోత్తం, బళ్లా రాములు, తంగెళ్లమూడి రామారావు, మంగలపూడి సన్నీ పాల్గొన్నారు.

అమలుకాని హామీలతో వంచన

వీరులపాడు: కూటమి ప్రభుత్వం అమలుకాని హామీలతో ప్రజలను పూర్తిగా మోసం చేసిందని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెన్నారావుపాలెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూపర్‌ సిక్స్‌ పథకాల్లో ఒక్కటి కూడా పూర్తిగా అందించలేకపోయారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేయడంలో చంద్రబాబు పీహెచ్‌డీ చేశారని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోందని దుయ్యబట్టారు. రైతు విభాగం నాయకుడు నువ్వుల విశ్వనాథం, సర్పంచ్‌ మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, చెన్నారావుపాలెం గ్రామ కన్వీనర్‌ పత్తిపాటి మల్లికార్జునరావు, నరసింహారావుపాలెం గ్రామ కన్వీనర్‌ ఈడూరి కృష్ణారెడ్డి, నాయకులు పచ్చాల కోటేశ్వరరావు, పలకా మోహన్‌రెడ్డి, డోర్నాల రవి, పాపిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు వైఫల్యాలను వివరించాలి

చందర్లపాడు(నందిగామ టౌన్‌): మండలంలోని ఏటూరు, విభరింతలపాడు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ కందుల నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలన పూర్తిగా విఫలమైందని ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారు చేస్తున్న మోసాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. ఏటూరు గ్రామ కన్వీనర్‌ వద్దిరనేని సాంబశివరావు, ఏటూరు గ్రామ కన్వీనర్‌ కమ్మ వెంకటేశ్వరరావు, నాయకులు వైఎస్‌ఎన్‌ ప్రసాద్‌, వెలగపూడి వెంకటేశ్వరరావు, గుడేటి శ్రీనివాసరావు, బుగ్గినేని సురేష్‌, చల్లగుండ్ల వేణు, ధనమూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



విభరింతలపాడులో క్యూఆర్‌ కోడ్‌ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



కంచికచర్ల: స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకుడు తంగిరాల సుజినీకుమార్‌ కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మొండితోక జగన్‌మోహనరావు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుజినీకుమార్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ పట్టణ కన్వీనర్‌ వేమా సురేష్‌బాబు, నాయకులు అమర్లపూడి యోహాన్‌, ప్రొద్దుటూరి విల్సన్‌, తంగిరాల ప్రసాదరావు, ప్రముఖ కవి తంగిరాల సోనీ ఉన్నారు.

రాయితీపై దాణా పంపిణీ

చందర్లపాడు(నందిగామ టౌన్‌): ప్రభుత్వం రాయితీపై అందించే పశువుల దాణాను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారులు వెంగళరావు, ప్రదీప్‌ సూచించారు. చందర్లపాడు మండలం పాతబెల్లంకొండవారిపాలెం గ్రామంలో సోమవారం పాడి రైతులకు దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని దీనిలో భాగంగానే రూ. 1,100ల విలువ చేసే బస్తాను రూ. 600లకు అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్‌, వడ్లమూడి లక్ష్మీనారాయణ, గద్దె హనుమంతరావు, పలువురు పశు పోషకులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో భర్తీకాని సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ రవిబాబు తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌ ప్రథమ సంవత్సరంలో చేరడానికి గతంలో ప్రవేశ పరీక్షకు హాజరైన, హాజరు కాని వారు కూడా ఈ నెల 6వ తేదీ లోపు నేరుగా తమ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్‌ తెలిపారు.

ముర్రుపాలు అమృతంతో సమానం

పెనుగంచిప్రోలు: బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్‌ ఆధ్వర్యాన గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లులు బిడ్డలకు తప్పనిసరిగా ముర్రుపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. అలాగే ముండ్లపాడులో జరిగిన అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, విమల, జయలక్ష్మి, నాగమణి, మంజుల, రాజ్యలక్ష్మి, సునీత, ధనలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో అవగాహన సదస్సులో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు

చందాపురంలో..

నందిగామ రూరల్‌: మండలంలోని చందాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్‌ సీడీపీవో లక్ష్మీభార్గవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు విధిగా తల్లిపాలు పట్టాలన్నారు. తల్లిపాలు శిశువు ఎదుగుదలకు, రోగనిరోధకశక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ వెంకట్రావమ్మ, ఏఎన్‌ఎం పద్మ, సీహెచ్‌వో ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్‌ మీటర్లతో సామాన్యులపై పెనుభారం

నందిగామ రూరల్‌: కూటమి ప్రభుత్వం స్మార్ట్‌ మీటర్లను ఏర్పాటు చేసి సామాన్యులపై మోయలేని భారం వేస్తోందని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కటారపు గోపాల్‌ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన విద్యుత్‌ సర్దుబాటు చార్జీలను తగ్గించడంతో పాటు స్మార్ట్‌ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యాన మండలంలోని పల్లగిరి, కమ్మవారిపాలెం, రాఘవాపురం గ్రామాల్లో సోమవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్‌ మీటర్లను పగలగొట్టాలని చెప్పిన నేతలు అధికారంలోకి రాగానే అవే స్మార్ట్‌ మీటర్లను బిగించడం దుర్మార్గ చర్యని పేర్కొన్నారు. విద్యుత్‌ భారాన్ని తగ్గిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే సర్దుబాటు చార్జీల పేరుతో ఏకంగా రూ. 15,485 కోట్ల పెను భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్దుబాటు చార్జీలను తగ్గించడంతో పాటు స్మార్ట్‌ మీటర్ల ఏర్పాటు రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవిశేఖర్‌, రఘు, విఠలరావు, స్వామి, రామారావు, సురేష్‌, అబ్రహం పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

చిల్లకల్లులో అంగన్‌వాడీల ఆందోళన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఫోన్‌లో యాప్‌లు సక్రమంగా పని చేయడం లేదంటూ ఐసీడీఎస్‌ ప్రాజెక్టు పరిధిలోని పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం గ్రామంలోని ప్రాజెక్టు కార్యాలయంలో ఫోన్‌లను అప్పగించారు. ముందుగా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందించిన ఫోన్‌లు సక్రమంగా పని చేయడం లేదని తెలిపారు. సర్వర్‌లు, యాప్‌లు పని చేయని కారణంగా యాప్‌లలో వివరాలు నమోదు చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు మాత్రం తాము పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సూపరింటెండెంట్‌ వెంకటేశ్వరరావు ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కార్యాలయంలో భద్రపరిచారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చిల్లకల్లు ఐసీడీఎస్‌ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

అమ్రితసాయిలో హాక్‌ ఫోర్జ్‌ సైబర్‌ సెక్యూరిటీ

కంచికచర్ల: పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్‌ కళాశాలలో సోమవారం హాక్‌ ఫోర్జ్‌ సైబర్‌ సెక్యూరిటీ ఈవెంట్‌ను నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్‌ కె. రామ్మోహనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎథికల్‌ హ్యాకింగ్‌, సైబర్‌ ఫోరెన్సిక్‌పై సైబర్‌ సెక్యూరిటీ బ్రాంచి విద్యార్థులకు ఓరియంటెడ్‌ విధానంలో డెమో, ప్రజంటేషన్‌ ప్రదర్శనల ద్వారా ప్రాక్టికల్‌గా వివరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో సైబర్‌ సెక్యూరిటీ విద్యార్థులతో కలసి క్వాంటమ్‌ సైబర్‌ సెక్యూరిటీ క్లబ్‌ను ప్రారంభించామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎం. శశిధర్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేట అర్బన్‌: జయప్రద ఫౌండేషన్‌ ఆధ్వర్యాన పట్టణంలో ఈనెల 5, 6, 7 తేదీల్లో 15, 16, 18 వార్డుల్లో శ్రీరేణుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం సెంటర్‌లో మూడు రోజుల పాటు సంచార వైద్యశాల ద్వారా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్‌ చైర్మన్‌ తొండపు దశరథ జనార్ధన్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌ యాదవ్‌ ప్రారంభిస్తారని చెప్పారు. ముఖ్య అతిథులుగా కేడీసీసీ బ్యాంక్‌ చైర్మన్‌ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌(తాతయ్య), మున్సిపల్‌ చైర్మన్‌ రాఘవేంద్ర, మున్సిపల్‌ కౌన్సిలర్లు పాల్గొంటారని తెలిపారు. వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎస్‌ఐ కౌన్సిల్‌ సభ్యురాలిగా ప్రేమకుమారి



పెనుగంచిప్రోలు: దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం (సీఎస్‌ఐ) కృష్ణా, గోదావరి డియోసిస్‌ కౌన్సిల్‌ సభ్యురాలిగా పెనుగంచిప్రోలు ప్యారిష్‌ నుంచి వేల్పుల ప్రేమకుమారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం స్థానిక సీఎస్‌ఐ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి జగ్గయ్యపేట డీనరీ చైర్మన్‌ రెవ దర్శన్‌ సుందర్‌ ప్రేమకుమారి ఎంపికను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమెను చర్చి పెద్దలు, మహిళా సంఘాలు, గురువులు సత్కరించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



మక్కపేటలోని జగనన్న కాలనీలో డంప్‌ చేసిన ఇసుక నిల్వలు

- పట్టించుకునే వారే కరువు
- రాత్రి వేళల్లో తెలంగాణాకు తరలింపు

వత్సవాయి: ఉచిత ఇసుక అంటూ కూటమి ప్రభుత్వం చేసిన హామీ ఇసుక అక్రమార్కులకు వరంలా మారింది. కూటమి ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మండలంలోని లింగాల, ఇందుగపల్లి, కన్నెవీడు, ఆళ్లూరుపాడు, పోలంపల్లి రేవుల నుంచి ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్లకు ఇసుకను నింపుకొని వెళ్తున్నా కూడా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం. అధికారుల ఉదాసీన వైఖరి అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. వాస్తవానికి ఇసుక కావాలంటే మండలంలో ఆళ్లూరుపాడు, ఇందుగపల్లి రేవుల వద్ద స్టాకు పాయింట్‌ ఉంది. అక్కడకు వెళ్లి ప్రభుత్వానికి టన్నుకు రూ. 100 చెల్లించి ఇసుకను తీసుకొని వెళ్లాలి. ఒక ట్రాక్టర్‌ ఐదు టన్నుల ఇసుక పడుతుంది. కాబట్టి ట్రక్కు ఇసుక రూ.500 అవుతుంది. అయితే ట్రాక్టర్ల వాళ్లు ఎవరూ స్టాక్‌ పాయింట్‌ వద్దకు వెళ్లడంలేదు. మునేరు రేవుల వద్ద వారి వీలును బట్టి ఎక్కడ ట్రాక్టర్‌ వెళ్లడానికి వీలుంటుందో చూసుకుని కూలీలతో మునేటిలో ఇసుకను నింపుకొని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇదంతా పట్టపగలు ప్రతినిత్యం జరుగుతున్న కూడా రెవెన్యూ, పోలీస్‌ శాఖల వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇసుక అక్రమార్కుల నుంచి రెవెన్యూ, పోలీస్‌శాఖల వారికి ప్రతినెలా ముడుపులు వెళుతున్నట్లు సమాచారం.

తెలంగాణాకు తరలిపోతున్న ఇసుక

నియోజకవర్గం తెలంగాణా రాష్ట్రానికి సరిహద్దుగా ఉండటంతో ఇసుక అక్రమంగా ఆ రాష్ట్రానికి తరలివెళుతోంది. పగలు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఒకచోట డంప్‌ చేసుకుని రాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా తెలంగాణాకు సరఫరా చేస్తున్నారు. మునేటి ఇసుకకు తెలంగాణాలో డిమాండ్‌ ఉండటంతో అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణాలోని ఖమ్మం, కోదాడ, సూర్యాపేట, హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్‌ నిర్మాణాలు చేసేవారిని, బిల్డర్ల వారితో ఇసుక సరఫరా లావాదేవీలు కుదుర్చుకుని యథేచ్ఛగా అక్రమ రవాణా సాగిస్తున్నారు. మండల కేంద్రం వత్సవాయికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో తెలంగాణా సరిహద్దు ఉంది. సరిహద్దు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన అక్కడ ఎటువంటి తనిఖీలు నిర్వహించకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

తిరువూరు: ఏ.కొండూరు మండలం రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన శివ దత్తసాయి మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. సాయిబాబా, నంది, వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహాలతో పాటు శివలింగాన్ని ఆలయ నిర్మాణ కర్తలు, ప్రవాస భారతీయులు గుంటక సుదర్శనరెడ్డి కుటుంబ సభ్యులు ప్రతిష్ఠించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాగర్‌ జలాలు విడుదల



గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామ సమీపంలోని 65వ నెంబరు జాతీయ రహదారి వద్ద ఉన్న 16వ బ్రాంచ్‌ కెనాల్‌ నుంచి దిగువకు సాగర్‌ జలాలను ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్‌, తంగిరాల సౌమ్యలతో కలిసి సోమవారం కేడీసీసీ చైర్మన్‌ నెట్టెం రఘురాం విడుదల చేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ సాగర్‌ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేశారన్నారు. నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌ఎస్పీ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట వీరబాబు, ఏలూరి గోపాలరావు, యనమదల నరసింహారావు, కట్టా నరసింహారావు, ఎన్‌ఎస్పీ అధికారులు పాల్గొన్నారు.